సాక్షి
పెద్దపల్లి
గురువారం ; 4 ; మే ; 2023



రిజర్వు షట్‌డౌన్‌లో బీ–థర్మల్

రామగుండం: విద్యుత్ వినియోగం తగ్గిపోవడంతో బీ–థర్మల్ రిజర్వు షట్‌డౌన్‌లో ఉంచారు. బీ–థర్మల్‌లో ఉత్పత్తికి అవకాశం ఉన్నా.. డిమాండ్ లేక ఈ నిర్ణయం తీసుకున్నారు.



పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని ఆల్‌ఇండియా ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ మొండయ్య అన్నారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మిల్లర్ల కోసమే పనిచేస్తున్న ప్రభుత్వం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

పాలకుర్తి: రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెబుతున్న రాష్ట్రప్రభుత్వం మిల్లర్ల కోసమే పనిచేస్తోందని బీజేపీ నాయకుడు సోమారపు సత్యనారాయణ అన్నారు. పాలకుర్తి, బసంత్‌నగర్, కొత్తపల్లిలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మిల్లర్లు తేమ, తాలు పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 10కిలోలు కోత విధించడం సర్కారు అసమర్థతకు నిదర్శనమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పత్తి సంజీవ్, నాయకులు మాదాసు రాజేశం, బాలసాని మల్లేశం, మనోజ్‌కుమార్, నర్సయ్య, లింగమూర్తి, మేకల రవి పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు నిలబడతాయి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మహేందర్

సుల్తానాబాద్ : గుండె ఆగిన వెంటనే సీపీఆర్ చేస్తే మనిషి బతికే అవకాశం ఉంటుందని కంటివెలుగు నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చైర్‌పర్సన్ ముత్యం సునీత మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారికి ప్రథమ చికిత్స అందక చాలామంది మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. గుండె కొట్టుకోవడం ఆగిన నిమిషంలోపు అందించే చికిత్సను గోల్డెన్‌టైం అంటారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వార్డు కౌన్సిలర్ రెవెల్లి తిరుపతి, మేనేజర్ అలీమొద్దీన్, హెచ్‌ఎస్.వెంకట్ రెడ్డి, ఏఎన్‌ఎం శారద, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఐఎన్టీయూసీ కార్మికుల పక్షపాతి



జెండా ఆవిష్కరిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఐఎన్టీయూసీ కార్మికుల పక్షపాతి అని, కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతుందని యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయం ఆవరణలో ఐఎన్టీయూసీ ఆవిర్భావం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 1947లో యూనియన్ ఆవిర్భవించిందని, 75 ఏళ్లుగా కార్మికులకు సేవలందిస్తోందని పేర్కొన్నారు. ఎన్టీపీసీలో అడిషనల్ ఎన్సీబీసీ సభ్యుడిగా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందున్నానని వెల్లడించారు. అనంతరం ఆయనను యూనియన్ నాయకులు సన్మానించారు. ఉద్యోగ గుర్తింపు సంఘం ఇన్‌చార్జి వర్కింగ్ ప్రెసిడెంట్ బండారి కనకయ్య, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కందుల స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్, కమలాకర్‌రావు, అశోక్‌రెడ్డి, రమేశ్, ముత్యాల శ్రీనివాస్, గణపతి పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో అదనపు గదులు



పనులు ప్రారంభిస్తున్న ఈవో సదయ్య

ఓదెల: స్థానిక మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అదనపు గదుల నిర్మాణానికి ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఈవో సదయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. భక్తుల నుంచి విరాళంగా వచ్చిన రూ.80లక్షలతో పనులు చేపట్టనున్నారు. జెడ్పీటీసీ గంట రాములు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, డైరెక్టర్లు, ఒగ్గుపూజారులు పాల్గొన్నారు.

పౌరసేవలు అంతంతే..!

- ఆన్‌లైన్ ఫిర్యాదుల పరిష్కారం తక్కువే..
- అవగాహన లేక దూరంగా పట్టణ ప్రజలు

యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు

బల్దియా	ఫిర్యాదులు	పరిష్కరించినవి
రామగుండం	11,217	8585
పెద్దపల్లి	664	649
సుల్తానాబాద్	21	20
మంథని	8	6



సాక్షి, పెద్దపల్లి: 'కమిషనర్ సారూ.. మా గల్లీలో నీరు సక్రమంగా రావటం లేదు..' 'మా కాలనీలో రోడ్లు బాగాలేవు..' 'గుంతలు పూడ్చాలి..' 'వీధి దీపాలు వెలగట్లేదు..' ఇలా మున్సిపల్ ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులపై సత్వర పరిష్కారం గగనమైంది. పారదర్శక సేవలకు సిటిజన్ బడ్డీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినా.. పట్టణవాసులకు వాటిపై అవగాహన కరువైంది. ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సమస్యల పరిష్కారానికి నేరుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు తెలిసినవారు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కరించకుండానే 'క్లోజ్' చేస్తున్నారని పట్టణవాసులు వాపోతున్నారు. ఫలితంగా రామగుండం కార్పొరేషన్ సహా మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో పట్టణవాసులు సోషల్ మీడియా వేదికగా తమ సమస్యలను ఫొటోలు, వీడియోలు తీసి పోస్ట్ చేస్తున్నారు.

ప్రజలకు అవగాహన శూన్యం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్యం ఘనంగా ఉన్నా.. ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొదట యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఫోన్ నంబరు, ఇతర వివరాలు, సమస్య ఫొటోతో తప్పనిసరిగా ఫిర్యాదు చేయాలి. ఇందులో ఆస్తి పన్ను చెల్లింపు, పౌర సేవలు, ఫిర్యాదులు, సంబంధిత వార్డుల వారీగా అధికారులు, సిబ్బంది జాబితా, ప్రకటనలు, సలహాలు, సూచనలు తదితర విషయాలను ఈ యాప్‌లో పొందుపర్చారు. అయితే ప్రజలకు అవగాహన కల్పించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చొరవ చూపడం లేదనే విమర్శలు నెలకొన్నాయి. 22 రకాల సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నా అవగాహన లోపంతో కేవలం పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ అంశాలపైనే కొంతమంది ఫిర్యాదు చేస్తున్నారు.

సిటిజన్ చార్ట్ అమలేది..?

మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళిక, పన్నులు, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగాల్లో దరఖాస్తులు కదలటం లేదు. పౌరసేవ పట్టిక అమలు, దస్త్రాల పరిష్కారం, జాప్యంపై సమీక్షలు లేవు. నిబంధనల ప్రకారం నెలకు రెండుసార్లు సిటిజన్ చార్ట్ అమలు, పెండింగ్ దస్త్రాలు, పౌరసేవలపై సమీక్షించాలి. ఈ విధానం ఎక్కడా అమలు కావటం లేదు. దీంతో కిందిస్థాయి సిబ్బంది వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలను డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. నిర్ణీత గడువులోపు పరిష్కరించాల్సిన ఫైళ్లు కూడా నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ఇదే విషయమై రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని కమిషనర్లను వివరణ కోరగా.. ఆన్‌లైన్‌లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నామని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని చెప్పడం గమనార్హం.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు



రామగుండం కార్పొరేషన్ 25వ డివిజన్ టీచర్స్‌కాలనీలో డ్రైనేజీ కాలువ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు, ఈగలు పెరిగిపోయాయి. పలు వ్యాధులతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై కార్పొరేషన్ సిటిజన్ బుడ్డీ యాప్‌లో అనేకసార్లు ఫిర్యాదు చేసిన. పరిష్కరించకుండానే క్లోజ్ చేశారు. నేరుగా కార్యాలయంలో ఉన్నతాధికారులకు కలిసి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

– ఆర్.శంకర్, టీచర్స్ కాలనీ, గోదావరిఖని

వానగండం వీడలే..!



- మరో నాలుగు రోజులు వానలు కురిసే అవకాశం
- ఉమ్మడి జిల్లాకు పొంచిఉన్న ఈదురు గాలుల ముప్పు
- ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో పంటల నష్టం
- పాత జిల్లాలో సాధారణానికి మించి కురిసిన వాన

మార్చి ఒకటో తేదీ నుంచి మే మూడో తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో సగటు వర్షపాతం

జిల్లా	అసలు (మి.మీ)	సాధారణం (మి.మీ)	వ్యత్యాసం
కరీంనగర్	173.3	33.9	411
జగిత్యాల	114.1	39.5	189
పెద్దపల్లి	121.1	29.6	309
రాజన్నసిరిసిల్ల	161.6	40.8	296

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లారైతులపై ప్రకృతి ప్రకోపం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఏప్రిల్ నెలలో మొదలైన వరుణిడి ప్రతాపం.. మే నెలలోనూ కొనసాగేలా ఉంది. ఈనెల 4,5,6,7వ తేదీల్లోనూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవవచ్చని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. గత ఏప్రిల్‌లో వరుసగా వడగండ్లు, అకాల వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. గత వందేళ్లలో రాష్ట్రంలో ఏనాడూ చూడని చెడగొట్టు వానలని ప్రభుత్వమే అభివర్ణించడం ప్రస్తుత పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా ఏప్రిల్ 22,24,30వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున పంటనష్టం చేకూరింది. ఆరుగాలం శ్రమించిన పంట వడగండ్ల దెబ్బకు ధ్వంసం కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు కల్లాల్లో తడిసిన ధాన్యం కొంటామని, ఎకరానికి రూ.10వేల పంట నష్టపరిహారం ఇస్తామన్న ప్రభుత్వ హామీతో పరిహారం కోసం కోటికళ్లతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏ జిల్లాలో ఎలా అంటే

ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. వీటి ప్రభావం జగిత్యాల, సిరిసిల్లలో తక్కువగా కరీంనగర్, పెద్దపల్లిలో అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షంకురిసినా.. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పోలీసులు, రెవెన్యూ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని ముందుజాగ్రత్తగా సూచనలు కూడా చేసింది. కరీంనగర్ జిల్లాలో తాజా సమాచారం ప్రకారం.. 56,066 ఎకరాలు, జగిత్యాలలో 65,794 ఎకరాలు, సిరిసిల్లలో 18,230 ఎకరాలు, పెద్దపల్లి 36,596 ఎకరాల మేర పంటలు నాశనమయ్యాయి. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో 1,76,686 ఎకరాల్లో పంట నష్టపోయిందని, ఇది దాదాపు రెండు లక్షల ఎకరాల వరకు చేరుకునే అవకాశముందని సమాచారం. ఇప్పటి వరకూ ప్రాథమిక నష్టంగా అంచనా వేసిన ప్రభుత్వం దీనిపై త్వరలోనే తుది నివేదిక రూపొందించిన అనంతరం రైతులకు పరిహారం విడుదల చేయనుంది. ఇప్పటికే అనేక గండాలు దాటుకున్న రైతన్న రాబోయే నాలుగురోజులు కూడా విషమపరీక్షే ఎదుర్కొవాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరికోతలు ఇప్పుడే చేపట్టవద్దని వానల గండం తొలిగాక చేపట్టడం మంచిదని సూచిస్తున్నారు. మిగిలిన వాణిజ్య పంటల విషయంలో సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

దంచి కొట్టిన వానలు

మండువేసవిలో అకాల వర్షాలు వానాకాలాన్ని తలపించాయి. ఒకదశలో భారీవానలు రెండుమూడు రోజులపాటు తుపానును తలపింపజేశాయి. ఈ సీజన్‌లో కురవాల్సిన వానల కన్నా అధికంగా కురిశాయని వాతావరణశాఖ వెల్లడించింది. సాధరణంగా వేసవిలో అసలు వానజాడ కానరాదు. కానీ, ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రకృతి పగబట్టినట్లుగా ఒకదాని తరువాత మరొకటి, వరుసగా భారీ వానలు, వడగండ్లు, ఈదురుగాలులు రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. ఈ సీజన్‌లో సగటున 3 సెం.మీల వర్షపాతం నమోదైతే అది సాధారణ వర్షపాతం కింద లెక్క. కానీ విచిత్రంగా ఉమ్మడి జిల్లాలో కనిష్ఠంగా 11 సెం.మీల నుంచి గరిష్ఠంగా 17 సెం.మీల వరకు కురవడంపై వ్యవసాయశాఖ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్, సిరిసిల్లలో వానలు దంచికొట్టగా.. జగిత్యాల, పెద్దపల్లిలోనూ బాగానే కురిశాయి.

'ముస్కాన్' స్కీం పోటీలో రామగుండం జీజీహెచ్

- ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం
- రెండు రోజులపాటు పరిశీలన
- ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులు
- ఎంపికైతే రూ.9లక్షల ప్రోత్సాహకం



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న బృందం ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): ప్రభుత్వ ఆసుపత్రుల్లో నవజాత శిశు మరణాలను తగ్గించడం.. ఉచిత సేవలను మెరుగుపర్చడం కోసం కేంద్రం 'ముస్కాన్ (స్మైల్)' స్కీంకు శ్రీకారం చుట్టింది. పుట్టిన బిడ్డ నుంచి 12 ఏళ్లలోపు పిల్లలకు మెరుగైన వైద్య సేవలందించడమే ముస్కాన్ స్కీం ముఖ్య ఉద్దేశం. ఆయా ఆస్పత్రుల్లో సేవల తీరును నేషనల్ హెల్త్ మిషన్ బృందం తనిఖీ చేస్తోంది. ఇందులోభాగంగా రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)ను బుధవారం ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ యుస్తాఫా యూనస్, డాక్టర్ వందన సందర్శించారు. రెండురోజులపాటు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి గర్భిణులు, పిల్లలకు అందుతున్న వైద్యసేవలపై పూర్తి సమాచారం సేకరించనున్నారు. బృందం వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృపాబాయి, వైద్యులు అప్పారావు, తిరుమలేశ, అరుణ, రేణుక, అశోక్, ఆదిష్‌రెడ్డి, శ్రీలత, శిరీష తదితరులు ఉన్నారు.

క్షుణ్ణంగా పరిశీలన.. వివరాల సేకరణ...

ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులు ముందుగా పీడియాట్రిషన్, గైనకాలజిస్టులు, ఆర్‌ఎంఓతో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీలో పారిశుద్ధ్యం, వైద్య పరికరాలు, సిబ్బంది పనితీరు, రికార్డులు, ఎస్‌ఎన్‌సీయూ, పిల్లల వార్డు, ఇంజక్షన్ గదులను తనిఖీ చేశారు. కేంద్ర నాణ్యతాప్రమాణాలను పరిశీలించి, చెక్ లిస్టు ఆధారంగా వివరాలు నమోదు చేసుకున్నారు.

ముస్కాన్‌కు ఎంపికైతే రూ.9లక్షల నగదు

ముస్కాన్ పథకానికి ఎంపికైతే రూ.9లక్షల నగదు ప్రోత్సాహకం లభించనుంది. మూడేళ్లపాటు ఏటా రూ.3లక్షల చొప్పున అందజేయనున్నారు. ఈ నిధుల నుంచి 25 శాతం సిబ్బందికి ఇన్సెంటీవ్‌గా కేటాయించనున్నారు. మిగిలిన 75 శాతం పిల్లల వైద్య సేవల అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది.

మంచి స్కోర్ వస్తేనే స్కీంకు ఎంపిక

ముస్కాన్ స్కీంకు మంచి స్కోర్ వస్తేనే ఆస్పత్రిని ఎంపిక చేస్తారు. ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లు, నవజాత శిశు సంరక్షణ కేంద్రం విభాగాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఒక్కో విభాగానికి 74కు పైగా మార్కుల వస్తే.. అన్ని విభాగాల్లోని మార్కులపై 100 శాతం స్కోర్ చేసి 75 శాతం స్కోర్ చేసిన ఆస్పత్రిని ముస్కాన్ స్కీంకు ఎంపిక చేస్తారు.

ఆస్పత్రిని ముస్తాబు చేసిన అధికారులు

ముస్కాన్ స్కీంకు జీజీహెచ్ ఆస్పత్రి ఎంపికయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలన బృందాన్ని ఆకట్టుకునేలా ఆస్పత్రిని అందంగా ముస్తాబు చేశారు. పిల్లలు ఆహ్లాదంగా గడపటానికి ఓపీ, వార్డుల దగ్గర ప్రత్యేక ఆటబొమ్మలను ఏర్పాటు చేశారు. గోడలపై చిన్నారుల బొమ్మలు పేయింటింగ్ వేయించారు.

రైతుల కష్టాలు పట్టని సీఎం

- బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్



కనుకులలో ధాన్యం పరిశీలిస్తున్న వివేక్

సుల్తానాబాద్‌రూరల్: మహారాష్ట్ర, పంజాబ్ రైతులను ఆదుకుంటామంటున్న సీఎం కేసీఆర్‌కు ఇక్కడి రైతుల కష్టాలు కనిపించడం లేదని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు గడ్డం వివేక్ అన్నారు. మండలంలోని కనుకుల, రామునిపల్లి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కొంటామన్న సీఎం ప్రకటన ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కాళేశ్వరం పంపులు మునిగితే వెంటనే రూ.1200 కోట్లు ఇచ్చిన సీఎంకు.. రైతుల నష్టం కనిపించకపోవడం విడ్డూరమన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని చివరి గింజవరకు కొనాలని, ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయం ముందు జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఆయన వెంట నాయకులు గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, మీస అర్జున్ రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సజ్జత్, మహేందర్‌యాదవ్, పవన్, కందుల శ్రీనివాస్ ఉన్నారు

ఇండస్ట్రియల్ పార్క్‌కు కుదిరిన ముహూర్తం

- ఈనెల 8న శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్
- అంతర్గాంలో భూములను పరిశీలించిన ఎమ్మెల్యే చందర్



ఇండస్ట్రియల్ పార్క్ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి మరో ప్రాజెక్టు వచ్చి చేరుతోంది. అంతర్గాం మండల కేంద్రంలోని టెక్స్‌టైల్ భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకానుంది. దీనికి ఈనెల 8న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్క్ ఏర్పాటు స్థలాన్ని ఎమ్మెల్యే అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, సర్పంచ్ కుర్ర వెంకటమ్మ, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతినాయక్‌తో కలిసి బుధవారం పరిశీలించారు.

పార్క్ ఏర్పాటుతో భారీగా ఉద్యోగాలు

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో ప్రత్యక్షంగా పదివేల మందికి.. పరోక్షంగా ఇరవై వేల మందికి ఉపాధి లభించనుంది. గోదావరినది మీదుగా మంచిర్యాల జిల్లా కేంద్రానికి వంతెన నిర్మాణంతో అంతర్గాం మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగులు, వారి కుటుంబాలతోపాటు పరోక్షంగా హోటళ్లు, రవాణా వ్యవస్థ తదితర రంగాలు ఊపందుకుంటాయి. ఆయా కంపెనీల్లో స్థానికులకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

2019లో భూముల గుర్తింపు

అంతర్గాం టెక్స్‌టైల్ శాఖకు చెందిన భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్‌కు 2019 జూలైలోనే స్థలాన్ని ఖరారు చేశారు. అయితే పలు సాంకేతిక కారణాలు, కోవిడ్‌తో జాప్యం జరిగింది. అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులకు చెందిన 548.26 ఎకరాల భూమి ఉన్నట్లు 2019లో ఏడీ వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఇందులో పార్కు ఏర్పాటుకు 102.20 ఎకరాలు అనువైన స్థలంగా గుర్తించారు. ఈ స్థలంలో గోలివాడ పరిధిలోని 57.23 ఎకరాలు, రాయదండి పరిధిలోని 44.37ఎకరాలుగా గుర్తించారు. స్థలాల వివరాలు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అక్విజేషన్ (సీసీఎల్‌ఏ) పరిధిలో ఉన్నట్లు ఎమ్మెల్యే చందర్ పేర్కొన్నారు.



సామూహిక కుంకుమ పూజలు

జిల్లాకేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో బొడ్రాయి మహోత్సవ వేడుకల్లో భాగంగా పండితులు శ్రీనివాసాచార్యులు మహిళలతో కుంకుమ పూజలు జరిపించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

పలువురిపై పీడీ యాక్టు



పీడీ యాక్టు ఉత్తర్వులను అందిస్తున్న మంథని సీఐ సతీశ్, ఎస్సై వెంకటేశ్వర్లు

మంథని: రామగుండం సీపీ పరిధిలోని మూడు జిల్లాల్లో పంటపొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, కాపర్‌వైర్ దొంగతనాలకు పాల్పడిన ఏడుగురు నిందితులపై పీడీ యాక్టు నమోదు చేసి ఉత్తర్వులను మంథని సీఐ సతీశ్ బుధవారం కరీంనగర్ జిల్లా జైలులో నిందితులకు అందించారు. పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడుగురుపై 41 కేసులు నమోదయ్యాయి. వీరిని పలుకేసుల్లో మంథని పోలీసులు ఇటీవల అరెస్టుచేశారు. మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామానికి చెందిన మద్దిపల్లి సాయితేజ, దోనిపల్లి సురేశ్, మీనుగు మల్లేశ్, రేగుంట వర్ధన్, చిన్నకుర్తి రాకేశ్, పులి భరద్వాజ్, మీనుగు బానేశ్‌కు పీడీ యాక్టు ఉత్తర్వులు అందించి వీరిని చర్లపల్లి జైలుకు తరలించారు.

ఆయన నేత్రాలు సజీవం



రాజన్న(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలో నివసిస్తున్న రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి మానేటి రాజన్న(62) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. సదాశయ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి చొరవతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐకేర్‌కు తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రమేశ్, మారెల్లి రాజిరెడ్డి, భీష్మాచారి, చంద్రమౌళి, కార్పొరేటర్ బాదే అంజలీదేవి, రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాజేందర్ అభినందించారు.

సార్లు లేని కార్లకు బిల్లులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో అధికారులు లేకున్నా, వారి పేరున అద్దె కార్లను నడిపినట్లు బిల్లులు నమోదుచేయడంపై సీడీఎంఏకు ఫిర్యాదుచేసినట్లు సీపీఐ సహాయ కార్యదర్శి మద్దెల దినేశ్ తెలిపారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కేశోరాం నూతన ఉత్పాదన విడుదల


పాలకుర్తి: బిర్లా గ్రూప్ కేశోరాం ఇండస్ట్రీస్ బసంత్‌నగర్ ఆధ్వర్యంలో 'కేశోరాం సూపర్ ప్లాస్ట్' అనే నూతన ఉత్పాదన బుధవారం మార్కెట్‌లోకి విడుదలైంది. ఫ్యాక్టరీలో సంస్థ సీవోడీ అభయ్‌కుమార్ దాదీచ్, సీఎంవో యూవీ రాజు మాట్లాడారు. వినియోగదారుల నిర్మాణ అవసరాలకు అనుగుణంగా నూతన సాంకేతిక విధానంతో కేశోరాం సూపర్‌ప్లాస్ట్ పేరుతో కొత్త ఉత్పాదకతను రూపొందించామన్నారు. ఇదీ ముఖ్యంగా ప్లాస్టర్, ఇటుక కట్టేందుకు అవసరాలకు అనుగుణంగా ఉపయోగపడుతుందన్నారు. సంస్థ సేల్స్ హెడ్ ముదస్సర్ షేక్, ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్‌వో శివరాం, సేల్స్ అండ్ మార్కెటింగ్ తెలంగాణ హెడ్ నాగరాజు, హెచ్‌ఆర్ మేనేజర్ గోవిందరావు, ఐఆర్ అధికారి వెంకటేశ్వరు పాల్గొన్నారు.

నేడు ఎన్టీపీసీకి డైరెక్టర్ రాక

జ్యోతినగర్: ఎన్టీపీసీ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఉజ్వల్ క్రాంతి భట్టాచార్య రామగుండం ప్రాజెక్టు పర్యటనకు గురువారం రానున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన పీటీఎస్‌లోని జ్యోతిభవన్‌కు చేరుకుంటారు. అనంతరం తెలంగాణ స్టేజీ–1లో నిర్మితమైన 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల రెండు యూనిట్లను పరిశీలిస్తారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉదయన్‌కుమార్, ఆర్‌ఈడీ దేభాశిస్ ఛటోపాధ్యాయ కూడా పర్యటించనున్నారు. ఉన్నతాధికారులు రానుండటంతో ప్రాజెక్టు అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పర్యాటకం కలే..(నా)

- ప్రాచీన బౌద్ధ స్తూపాన్ని మరిచిన పాలకులు
- పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి
- రోడ్డు, వసతులు లేక ఆసక్తిచూపని పర్యాటకులు
- ఈనెల 5న బౌద్ధ జయంతి



ఎలిగేడు/జూలపల్లి: బౌద్ధమత బోధనలతో ఫరిడవిల్లిన నేల ధూళికట్ట. గత అనుభవాన్ని ఈతరం ప్రజలు గుర్తుచేసుకుంటూ.. రాబోయే తరానికి అందించాల్సిన పూర్వీకుల చరిత్ర, సంప్రదాయ వారసత్వ వైభవం ఉన్న అపురూప ప్రదేశం. ఇక్కడి బౌద్ధస్తూపం తెలంగాణకే తలమానికం. ఇంతటి వైభవం ఉన్న ఈ ప్రాంత అభివృద్ధిని పాలకులు విస్మరించడం గమనార్హం.

రెండు మండలాల సరిహద్దులో..

ఎలిగేడు మండలం ధూళికట్ట, జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామాల సరిహద్దులో.. హుస్సేన్‌మియావాగు తీరాన ఉంది బౌద్ధస్తూపం. ధూళికట్టలో కోటలు, శాతవాహన రాజుల కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. ఆరో శతాబ్దంలో బాదనకుర్తిలో నివసించిన బావరి మహర్షి ఆహ్వానం మేరకు గౌతమ బుద్ధుడు ధూళికట్టలో పర్యటించినట్లు చరిత్ర చెబుతోంది. హుస్సేనిమియావాగు తీరంలో గౌతముడు ఏడువారాలపాటు గడిపాడనే ప్రతీతి. శాతవాహన రాజుల కాలంలో ధూళికట్టలో రాజభవనాలు ఏర్పాటుచేసుకుని హుస్సేనిమియావాగు తీరంలో కోటలు, బౌద్ధస్తూపాన్ని నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. కోటలను మట్టితో నిర్మించడంతో ధూళికోటగా పిలిచేవారనీ, కాలక్రమేణా ధూళికట్టగా మారిందని చెబుతుంటారు.

వెలుగుచూసింది ఇలా..

శాతవాహనుల రాజులకాలంనాటి సంస్కృతి, సంప్రదాయాలను వెలికి తీసేందుకు 1972లో అప్పటి పురావస్తుశాఖ నిపుణులు డాక్టర్ వీవీ.కృష్ణశాస్త్రి, కర్నాటకకు చెందిన స్వర్గీయ ఠాకూర్ రాజారాంసింగ్, డాక్టర్ గురు రాజారావు ఆధ్వర్యంలో ధూళికట్టలో తవ్వకాలు చేపట్టి, పరిశోధనలు చేశారు. ఇందులో శాతవాహనుల కాలం నాటి బౌద్ధస్తూపం, కోట ముఖద్వారం, ఐదుపడగల ముచిలిందనాగం, భోదివృక్షం, యక్షనులు, స్తూప నమూనాలు, మహాభినిష్క్రమణం, బుద్ధుని ప్రతిమలు, రాగినాణేలు, మట్టిబొమ్మలు, కుమ్మరి గాజులు, మృణ్మయ పాత్రలు వెలుగుచూశాయి. ఆనాటి ప్రజలు ప్రాకృతభాష, బ్రహ్మలిపి వాడినట్లు గుర్తించారు. బౌద్ధస్తూపాన్ని 19గుంటల స్థలంలో 36మీటర్ల వ్యాసార్ధంతో చతురాస్రాకారంలో కాల్చిన ఇటుకలను మందంగా తయారు చేయించి వాడినట్లు ధ్రువీకరించారు. ఇక్కడ లభించిన సున్నపు పలకలు, స్తూప నమూనా ఫలకాలు ఇప్పటికీ కరీంనగర్‌లోని పురావస్తు శాఖ మ్యూజియంలో ఉన్నాయి.

అభివృద్ధికి రూ.39లక్షలు

ధూళికట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2002లో అప్పటి ప్రభుత్వం బౌద్ధ స్తూప పునఃనిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ స్తూపానికి వాడే ఇటుకలను ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించారు. ఏమైందో తెలియదుగానీ.. కొంతమేర నిర్మాణం చేసి పనులు నిలిపివేశారు. అనంతరం అప్పటి పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ తన కోటా నుంచి రూ.50లక్షలు కేటాయించారు. ఆ నిధులతో రహదారి, బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎంపీ తన నిధులను వెనక్కి తీసుకున్నారు. బౌద్ధస్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించారని పేర్కొంటూ ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎలిగేడు మండల కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష కూడా చేపట్టారు.

పిక్నిక్ స్పాట్‌గా..

బౌద్ధస్తూపం పర్యాటకులు, సందర్శకులకు పిక్నిక్ స్పాట్‌గా మారింది. కరీంనగర్ నుంచి కాచాపూర్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ధూళికట్ట వరకు రూ.30 చార్జీతో చేరుకోవచ్చు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి జెండాచౌరస్తా మీదుగా రూ.50తో ఆటోలో చేరుకోవచ్చు. ధూళికట్ట చేరుకున్నాక బౌద్ధస్తూపానికి వెళ్లాలంటే కనీసం రెండు కిలోమీటర్లు నడవాలి. సొంత వాహనాలు ఉంటే నేరుగా చేరుకోవచ్చు.

ఏటా జయంతి ఉత్సవాలు

బౌద్ధస్తూపం వద్ద ఏటా మేలో బౌద్ధజయంతిని ఘనంగా నిర్వహిస్తారు. మహారాష్ట్ర నుంచి బౌద్ధసన్యాసులతో ప్రత్యేక పూజలు చేయిస్తారు. బౌద్ధులే ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఈనెల 5న బౌద్ధజయంతికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



నాగభూమిగా పిలిచే బౌద్ధస్తూపం అభివృద్ధితో ఈ ప్రాంతం పర్యాటకంగా మారుతుంది. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు చేసుకునేందుకు వనరులు ఉన్నాయి. బౌద్ధ జయంతికి ప్రభుత్వం సహకరించాలి.

– మొగురం రమేశ్, ఉత్సవ కమిటీ చైర్మన్, వడ్కాపూర్

పర్యాటకకేంద్రంగా మార్చాలి



సాక్షాత్తు బుద్ధుడే ఇక్కడ ధ్యానం చేశాడని చరిత్ర చెబుతోంది. బౌద్ధ స్తూపం విశిష్టత, ఈ ప్రాంతానికున్న ప్రాముఖ్యత ముందుతరాలకు తెలిసేలా.. పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం, పర్యాటక శాఖ ముందుకు రావాలి.

– మంచాల వెంకటస్వామి, మాజీ సర్పంచ్, వంగర

సొంత ఖర్చుతో రోడ్డు వేయించా



బౌద్ధస్తూపం వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సొంత డబ్బులు వెచ్చించి మట్టి రోడ్డువేయించా. ప్రస్తుతం ఆ మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జయంతికి వచ్చేవారి కోసం రోడ్డుతోపాటు కల్వర్టు నిర్మించాలి.

– కొట్టె రాజయ్య, వడ్కాపూర్

పర్యాటక కేంద్రంగా తీరిదిద్దాలి



అతి ప్రాచీనమైన బౌద్ధస్తూపానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి పర్యాకట కేంద్రంగా తీర్చిదిద్దాలి. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. గత చరిత్రను ప్రజలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

– గొల్లె కావేరి సర్పంచ్, ధూళికట్ట

అభివృద్ధి చేయాలి



అతి పురాతనమైన ధూళికట్ట బౌద్ధ స్తూపాన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి, ప్రజలు సందర్శించి చూసేందుకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయాలి.

– ఇరుగురాల సావిత్రమ్మ, ఎంపీటీసీ, ధూళికట్ట

చికిత్సపొందుతూ యువకుడు మృతి



శ్రీనాథ్ (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లికి చెందిన సలేంద్ర శ్రీనాథ్ (21) మంగళవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాపాలయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఖాజీపల్లికి చెందిన సలేంద్ర సమ్మయ్యకు ఒక్కగానొక్క కొడుకును అల్లారుముద్దుగా పెంచుకున్నాడు. ఇటీవల శ్రీనాథ్ ఎన్టీపీసీ తెలంగాణ పవర్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా ఉద్యోగంలో చేరాడు. పనినిమిత్తం బయటికి వెళ్లి ఇంటికి వస్తుండగా బైక్ అదుపుతప్పి ఇంటి ప్రాంగణంలో కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖనిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదుతో ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేకల కాపరి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజు

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం పన్నూర్‌కు చెందిన మేకల కాపరి ఉడుత రాజు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పన్నూర్‌లోని యాదవవాడలో గతంలో సింగరేణి స్థలంలో వినాయకమండపం కోసం షెడ్డు నిర్మించారు. ఆ స్థలాన్ని ఇటీవల సింగరేణి యాజమాన్యం నిర్వాసిత లద్నాపూర్‌కు కేటాయించింది. తమకు మరోచోట మండపం ఏర్పాటు చేయాలని యాదవులు కోరగా.. స్థలాన్ని ఎస్టేట్ అధికారులు కేటాయించారు. సదరు కాంట్రాక్టర్ పనులు చేసేందుకు బుధవారం ఆ స్థలం వద్దకు వచ్చాడు. అప్పటికే ఆ స్థలంలో రాజు మేకల పాక వేశాడు. ఖాళీ చేయాలని అధికారులు సూచించారు. దీంతో రాజు కుటుంబ సభ్యులు, సింగరేణి అధికారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. రాజు పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని సెంటనరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయనకు ప్రాణాపాయం లేదని తెలిపినట్లు తెలిసింది. సింగరేణి స్థలంలో రాజు గుడిసె వేశాడని, తొలగించేందుకు నిరాకరిస్తున్నాడని సెక్యూరిటీ అధికారి లక్ష్మినారాయణ తెలిపారు. ఆ స్థలాన్ని సంస్థకు అప్పగించాలని పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధ్యమే..!

- ముగిసిన ఉచిత కరాటే శిక్షణ
- విద్యార్థుల నుంచి స్పందన



కరాటే గ్రాండ్ మాస్టర్ మొండయ్యను సన్మానిస్తున్న విద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం): పట్టుదలతో జీవితంలో ఏదైనా సాధించవచ్చని, చిన్నతనం నుండి క్రమశిక్షణతో నిర్దేశిత లక్ష్యంతో విద్యను అభ్యసిస్తే అనుకున్నవి సులువుగా సాధించవచ్చని ఆల్‌ఇండియా ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ మొండయ్య అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో విశ్వభారతి విద్యాసంస్థల సహకారంతో మూడురోజులపాటు నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ బుధవారంతో ముగిసింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు మొదటి గురువులని, పిల్లలను గారాబం చేస్తూనే వారి లక్ష్యాలను కూడా గుర్తుచేయాలని, మంచి విద్య, ఆరోగ్యం అందించాలని పేర్కొన్నారు. సెలవులను వృథా చేయకుండా వారి జీవితానికి, ఆరోగ్యానికి అవసరమయ్యే వ్యాయామం, కరాటే శిక్షణ ఇప్పించడం గొప్ప విషయమన్నారు. అనంతరం విద్యార్థులు మొండయ్యకు శాలువా కప్పి జ్ఞాపిక అందించి సన్మానించారు.

శిక్షణ ఎంతో బాగుంది



విశ్వభారతి హైస్కూల్ ఆధ్వర్యంలో అందిస్తున్న కరాటే శిక్షణ బాగుంది. వ్యాయామం, యోగా, ఆరోగ్య రక్షణకు చేపట్టాల్సిన కార్యకలాపాలు వివరిస్తున్నారు. మాకు జీవితంలో ఎంతో ఉపయోగపడుతుంది.

– కృత్తిక, 8వ తరగతి, సెయింట్‌క్లేర్ హైస్కూల్

పాఠ్యాంశంలా శిక్షణ ఉండాలి



వేసవి సెలవుల్లో కాకుండా స్కూల్ సమయంలో కూడా వారంలో రెండురోజులు కరాటేలో శిక్షణ అందించాలి. కరాటే శిక్షణతో వివిధ పాఠశాలల విద్యార్థులం స్నేహితులుగా మారాం. విశ్వభారతి స్కూల్‌ను మరచిపోలేం.

– భవ్య, 9వ తరగతి

పొడిగిస్తే బాగుండు



మూడు రోజులు కాకుండా మరికొద్ది రోజులు పొడిగిస్తే ఎక్కువ నేర్చుకునే వాళ్లం. శిక్షణ అందించిన యాదగిరి గౌడ్ సార్‌కు కృతజ్ఞతలు. ఆత్మరక్షణకు దోహదపడేలా కరాటే శిక్షణ ధైర్యం ఇచ్చింది.

– నిత్యశ్రీ, 10వ తరగతి, విశ్వభారతి హైస్కూల్

కరాటే అంటే ఇష్టం



నాకు కరాటే అంటే ఇష్టం. నన్ను మా డాడి రోజు పొద్దున తీసుకొస్తున్నాడు. అందరితో కలిసి కరాటే నేర్చుకుంటున్నా. నాకు భయం లేదు. ఎవరికీ భయపడను. నాకు ఇంకా కరాటే నేర్చుకోవాలని ఉంది. బ్లాక్ బెల్ట్ అవుతాను.

– హరిహరన్, యూకేజీ

స్నేహితులను బలిగొన్న డీసీఎం వ్యాన్




సంఘటనా స్థలంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువకులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మిత్రుల దుర్మరణం
- క్యాటరింగ్‌కు వెళ్లి వస్తుండగా స్కూటీని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్
- కన్నీరుమున్నీరవుతున్న మృతుల కుటుంబాలు




నుజ్జునుజ్జయిన డీసీఎం వ్యాన్, స్కూటీ



మొయిన్‌ఖాన్(ఫైల్)



అభిషేక్(ఫైల్)

జగిత్యాలక్రైం: ఎండీ మొయిన్‌ఖాన్(21), గోకుల అభిషేక్(22), వరుణ్ సందీప్‌గౌడ్(20) మంచి మిత్రులు.. పేద కుటుంబాలకు చెందిన ఈ ముగ్గురు ఒకవైపు చదుకుంటూనే మరోవైపు తీరిక సమయాల్లో ఎంతోకొంత ఆదాయం ఆర్జించేందుకు శుభకార్యాల్లో క్యాటరింగ్(వంటలు తయారు చేయడం) పనులు చేస్తున్నారు.. తల్లిదండ్రులకూ చేదోడువాడుగా ఉంటున్నారు. భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఎన్నో కలలు కన్నారు. వారి ఆశలను డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు కబళించుకుపోయింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ శివారులో బుధవారం ఈ ఘటన జరిగింది. బీమారానికి చెందిన ఎండీ మొయిన్‌ఖాన్, రాగోజిపేటకు చెందిన గోకుల అభిషేక్, మేడిపల్లికి చెందిన వరుణ్ సందీప్‌గౌడ్ బుధవారం కొడిమ్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహ వేడుకల్లో వంటలు తయారు చేసేందుకు(క్యాటరింగ్) ఒప్పదం చేసుకున్నారు. ఈక్రమంలో బుధవారం ఉదయమే అక్కడకు చేరుకున్నారు. క్యాటరింగ్ ప్రక్రియ పూర్తయ్యాక సాయంత్రం తమ ద్విచక్ర వాహనం(స్కూటీ)పై తిరుగు ప్రయాణమయ్యారు. కొడిమ్యాల మండలం కోనాపూర్ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోకుల అభిషేక్, ఎండీ మొయిన్‌ఖాన్ మృతిచెందారు. వరుణ్ సందీప్ గౌడ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతి చెందాడు. ఈ ముగ్గురి కుటుంబాలు పేదవి కావడంతో ఎంతోకొంత ఆర్థిక సాయం చేసేందుకు యువకులు క్యాటరింగ్ పనులు ఎంచుకున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత వీరి ఖర్చులకు ఉంచుకుని, మిగతా సొమ్ము తల్లిదండ్రులకు ఇస్తూ వస్తున్నారు. ఎదిగి వచ్చిన కొడుకులు తమ బాగోలు చూస్తారని వారి తల్లిదండ్రులు భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, రోడ్డు ప్రమాదం ఆ ముగ్గురి బలితీసుకుని మూడు కుటుంబాల ఆశలను అడియాసలు చేశాయి. ఆస్పత్రుల్లో కుమారుల మృతదేహాలను చూసిన మృతుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎటు వెళ్లినా, ఏ పనిచేసినా ముగ్గురు స్నహితులు కలిసే చేసేవారని, అలాంటి వారిని విధి వక్రీకరించి ఇద్దరని బలితీసుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

భద్రతా దళాల కానిస్టేబుల్ ఎంపిక పరీక్ష

జ్యోతినగర్: భద్రతా దళాల కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాల ఎంపికకు ఎన్టీపీసీ రామగుండం సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో ఎస్సెస్సీ(జనరల్ డ్యూటీ కానిస్టేబుల్ నియామకపు ఫిజికల్ టెస్టులు ప్రారంభమయ్యాయి. బుధవారం ఎన్టీపీసీ రామగుండం మల్కాపూర్‌రోడ్‌లోని బ్యారక్స్‌లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జనరల్ డ్యూటీ కానిస్టేబుల్స్ నియామకానికి ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మొదటిదశలో గతేడాది రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు, ఫిజికల్ టెస్ట్ కోసం అందుబాటులో ఉన్న ఖాళీలను బట్టి ఎస్సెస్సీ–2023 జనరల్ డ్యూటీ కానిస్టేబుల్స్ నియామకాలు చేపట్టనున్నారు. ప్రాథమికంగా దరఖాస్తుదారుడి ఎత్తు, ఛాతీ, బరువును పరీక్షించి అనంతరం అర్హులైన వారికి 5 కిమీ పరుగు పందెం నిర్వహిస్తున్నారు. రోజుకు 250 మంది చొప్పున ఫిజికల్ టెస్టులను ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

అనాథ బాలికలకు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అనాథ, నిరుపేద బాలికలు (పదోతరగతి పూర్తి చేసినవారు) ప్రవేశార్హత పరీక్ష రాయకుండానే నేరుగా హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్ తెలిపారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ బాలికలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరిని కోల్పోయిన బాలికలు, నిరుపేద బాలికలు అర్హత పరీక్షకు హాజరుకాకున్నా నేరుగా ప్రవేశం పొందవచ్చన్నారు. మూడేళ్ల పాటు చదివే డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుపేద బాలికలు కుల, ఆదాయంతో పాటు బోనఫైడ్, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథ బాలికలు తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను పెద్దపల్లిలోని బాలరక్షభవన్ (శ్రీనివాసటాకీస్ ఎదురుగా) కార్యాలయంలో అందించాలని మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 9032427241లో సంప్రదించాలని కోరారు.

కారును ఢీకొన్న ఇసుక ట్రాక్టర్




చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కాట్నపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం ఇసుక ట్రాక్టర్ కారును ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఉపేందర్‌రావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన బుర్ర సతీశ్ అడ్వకేట్‌గా పనిచేస్తూ కరీంనగర్‌లో నివసిస్తున్నాడు. తన సోదరుడు సుల్తానాబాద్‌లో నూతనంగా ఇంటిని నిర్మిస్తుండగా భార్య, పిల్లలతో కారులో వెళ్తుండగా కాట్నపల్లి స్టేజీ వద్ద కొమండ్లపల్లి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఎలిగేడు వైపు ఒకేసారిగా యూటర్న్ తీసుకుంటూ కారును ఢీకొట్టాడు. దీంతో కారులోని సతీష్‌తో పాటు భార్య సుహాసిని, కూతుర్లు శ్రీక్షేత్ర(14), శ్రీఆద్య(12), కొడుకు శ్రీహాస్(08)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108లో సుల్తానాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు పంపించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్(మంథని): సెంటనరీకాలనీలోని రాణి రుద్రమాదేవి స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని బుధవారం ఆర్జీ–3 జీఎం టి.వెంకటేశ్వర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ధృఢత్వం పెంపొందుతుందన్నారు. 25 రోజులు నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని యువకులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైదానంలో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. క్రీడల సమయంలో అన్ని జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, సింగరేణి అధికారులు విలాస్ శ్రీనివాస్ పొద్దార్, లక్ష్మినారాయణ, మతీన్ హుస్సేన్, మారుతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గీత కార్మికులు

ఎలిగేడు: గీత కార్మికులకు బీమా పథకం అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడంపై బుధవారం మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మతల్లి ఆలయం వద్ద గౌడ కులస్తులు, కేసీఆర్ సేవా దళం నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శాసనమండలి చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాదరావు బర్త్‌డే సందర్భంగా కేక్‌ను కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం మండల ప్రధాన కార్యదర్శి రాయనవేణి శ్రీనివాస్, నాయకులు పిట్టల నరేశ్, మండల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన



సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో ఈనెల 8వ తేదీన ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కుమార్ దీపక్ బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి శంకుస్థాపన చేసే స్థలాన్ని పరిశీలించి అంతర్గాం ఎంపీడీవో భూక్య యాదగిరి, ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, ఎస్సై బోగె సంతోష్‌కుమార్‌కు పలు సూచనలు సలహాలిచ్చారు.

ఎంఈవోకు డీటీఎఫ్ ప్రతినిధుల సన్మానం



ఎంఈవోను సన్మానిస్తున్న డీటీఎఫ్ ప్రతినిధులు

రామగుండం: ఉమ్మడి రామగుండం మండల (రామగుండం, అంతర్గాం, పాలకుర్తి) ఎంఈవోగా పి.సంపత్‌రావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ప్రతినిధులు ఎంఈవోను కలిసి విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షంషొద్దీన్, పట్టణ శాఖ అధ్యక్షుడు ప్రతాపచారి, ప్రధాన కార్యదర్శి ఈర్ల రమేష్, మండలాల ప్రతినిధులు దత్తమూర్తి, ప్రకాష్‌రావు, ఉమామహేశ్వరరావు, రఘుపతిరావు, తదితరులున్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య

పెద్దపల్లిరూరల్: ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో బుధవారం కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తమ భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్, అకడమిక్ కోఆర్డినేటర్ రామకృష్ణ, కోఆర్డినేటర్ సంజీవ్, శ్రీనివాస్, అర్జున్, రవీందర్‌రావు, తదితరులున్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

పెద్దపల్లిరూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి యుండాలని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాల నియంత్రణపై అవగాహణ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం శాంతినగర్ ప్రాంతంలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది సిరాజుద్దీన్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొను 'గోల్‌మాల్'

- ఇష్టారాజ్యంగా కొనుగోలు
- 20 రోజుల క్రితమే కేంద్రాలకు..
- ధాన్యం తూకంలో లోపించిన పారదర్శకత
- మొలకెత్తుతున్న ధాన్యం
- పంట అమ్ముకునేందుకు రోజుల తరబడి రైతుల ఎదురుచూపు



తొగర్రాయి కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

మంథని/సుల్తానాబాద్‌రూరల్: ధాన్యం సేకరణలో పారదర్శకత లోపించింది.నిర్వాహకుల ఇష్టారాజ్యంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి పరిస్థితి నెలకొంది. వేసవికాలం కావడంతో మాయిశ్చర్ సమస్య అంతగా లేకున్నా నిర్వాహకులు చిక్కులను చూపుతూ కాంటాలు వేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అంతేగాకుండా జిల్లాలోని కొన్ని కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కార్మికులు, పెద్ద రైతుల పెత్తనంతో సన్న, చిన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మాయిశ్చర్ వచ్చినా తూకంలో జాప్యం

జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గంలో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మూడు వందలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐతే ఒకటి రెండు రోజుల్లోనే దాదాపుగా అందరి ధాన్యం మాయిశ్చర్ వస్తుంది. కానీ పదిహేను రోజులు దాటినా రైతుల ధాన్యం తూకం వేయడం లేదు. పెద్ద రైతులకు చెందిన ధాన్యం తూకం వేస్తూ తక్కువ ధాన్యం ఉన్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కేంద్రంలో రెండు నుంచి మూడు కాంటాలను మాత్రమే ఏర్పాటు చేసి ఓ కాంటాను హమాలీ కార్మికుల బంధువులు, దగ్గరి రైతులకు సంబంధించిన ధాన్యం మాత్రమే తూకం వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

వరి కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని కల్లాలకు, కొనుగోలు కేంద్రాలకు తరలించిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాలతో కళ్ల ముందే ధాన్యం తడిసిపోతున్నా, నీటిలో కొట్టుకుపోతున్నా ఏమి చేయలేక కన్నీటి పర్యంతమౌవుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబోయడం, మళ్లీ వర్షంకు తడిసిపోవడంతో రైతులు అరిగోస పడుతున్నారు. రైతులు కేంద్రాల్లో 15–20 రోజుల కిందనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పోయగా అవి మొలక ఎత్తుతున్నాయి.

కేంద్రాలు ప్రారంభమైనా.. కొనుగోళ్ల జాడేది?

సుల్తానాబాద్ మండలంలో సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పదిరోజుల క్రితం ప్రారంభించగా ఇప్పటి వరకు ఒక బస్తా కూడా కాంటా పెట్టలేదు. దీంతో కేంద్రాల్లో ధాన్యం రాశుల కుప్పలు పేరుకపోయాయి. అదేవిధంగా అకాల వర్షాలు కురవడంతో కొనుగోళ్లను ప్రారంభించలేదు. కాని అప్పటికే కొందరు రైతులు కేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యం నిబంధన ప్రకారం కొనుగోలు చేసేవిధంగా ఉన్న కొనుగోలు చేయలేదని, చేసినట్లాయితే కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తగ్గెవి అని రైతులు అరోపిస్తున్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

టోకెన్ ఆధారంగానే కాంటాలు



ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగానే కొనుగోళ్లు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు జారీ చేసే టోకన్ల ఆధారంగా సీరియల్ నంబర్ ప్రకారం కాంటాలు వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా సెంటర్ ఇన్‌చార్జీలు వ్యవహరిస్తే చర్యలు ఉంటాయి.

– మామిడాల అశోక్‌కుమార్, సీఈవో,పీఏసీఎస్,మంథని

రోడ్డుపైనే వడ్లు ఆరబోసినం



రామునిపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించక పోవడంతో కేంద్రంలో ధాన్యం రాశులు పేరుకపోయాయి. దీంతో పంటపొలంలోనే ధాన్యం పోయగా వర్షాలకు తడువడంతో మళ్లీ రోడ్డుపైనే ఆరబోసుకున్నాం. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోలు చేపట్టాలి. ధాన్యం తడిసి రంగు మారినా ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలి.

– సదయ్యగౌడ్, రైతు,తొగర్రాయి

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గ్రౌండ్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుతోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖనికి ఈ నెల 8న రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో సింగరేణి స్టేడియం గ్రౌండ్‌ను బుధవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో ఐటీ పార్క్ ఏర్పాటు స్థలాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, మూల విజయా రెడ్డి, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్:రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ అనుపమ రావు, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని మల్లయ్యపల్లె గ్రామంలో బుధవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. వర్షాల వల్ల వరిధాన్యం తడిసి పోయిందని రైతులు ఆందోళన చెందవద్దని అధికారులు ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లతో చర్చలు జరుపుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచు దేవెందర్ రావు, ఆర్ఐ లు ఉదయె, వైశాలి, ఉప సర్పంచు అశోక్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్

రామగుండం: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి ముద్దయింది. ఈ నేపథ్యంలో బుధవారం అంతర్గాం తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్ మండలంలోని ముర్మూర్, గోలివాడ, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని వ్యవసాయ కమిటీ ప్రతినిధులను ఆదేశిస్తూ రైతులకు భరోసా కల్పించారు.

ధాన్యం మొలకెత్తినా పట్టించుకోని ప్రభుత్వం



మొలకెత్తిన ధాన్యంను పరిశీలిస్తున్న ఉష

ఓదెల: అకాల వర్షాలతో ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడిసి మొలకెత్తినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలం కొలనూర్‌లో తడిసిన ధాన్యంను బుధవారం పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తి రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, వెంటనే తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ పటేల్, ప్రధానకార్యదర్శి సాత్తూరి అనిల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు తోట మధు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పలువురు మద్దతు

కమాన్‌పూర్: రామగిరి మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. ప్రొబేషనరీ కాలం పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను ప్రభుత్వం వెంటనే రెగ్యులైజర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క, సర్పంచ్‌లు అల్లం పద్మ, పల్లె ప్రతిమ, గంట పద్మ, బీజేపీ రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్‌రెడ్డితో పాటు తదితరులున్నారు.

తెలంగాణ భరోసా సభ విజయవంతం చేయాలి

ఎలిగేడు: ఈనెల 7న హైదరాబాద్‌లో సరూర్‌నగర్ స్టేడియంలో బీఎస్పీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా నాయకులు కాంపెల్లి బాబు,. బీవీఎఫ్ జిల్లా కన్వీనర్ మచ్చ రాహుల్ అన్నారు. బుధవారం ఎలిగేడులో మండల అధ్యక్షుడు మారం సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మహిళ కన్వీనర్ బూస శారద, బొడ్డు విష్ణు, మండల కన్వీనర్ సాగర్, రాకేశ్, నాయకులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు జీఎం సన్మానం



సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్: మేడే రోజున శ్రమశక్తి అవార్డులు పొందిన ఆర్జీ–3 డివిజన్ టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పింగిలి సంపత్‌రెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ జక్కుల దామోదర్ రావులను ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో బుధవారం జీఎం టి.వెంకటేశ్వర్‌రావు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, రఘుపతి, వెంకటమరణ, విలాస్ పోద్దార్ శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

సాగు చేస్తున్న భూమికి ఇవ్వాలని వినతి

రామగుండం: అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు బర్మా, కాందీశీకుల కుటుంబానికి చెందిన సాధనాల మల్లయ్య–అక్కమ్మ పేర్లతో ఉన్న రెండెకరాల భూమిని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న వారికి పట్టా జారీ చేయాలని వారసుడు సాధనాల మోహన్‌రావు సీఎం క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేశారు. 1985–91వ సంవత్సరాల్లో మిల్లులు మూతపడడంతో జీవనోపాధి నిమిత్తం టెక్స్‌టైల్ వీవింగ్ సొసైటీకి చెందిన సర్వే నెం.255/1 లోని గోలివాడ శివారులో ఉన్న 2.00 ఎకరాలు పదేళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. దీనిని తమ పేరుపై అసైన్‌మెంట్ చేసి పట్టా జారీ చేయాలని సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు మోహన్‌రావు పేర్కొన్నారు.

ఆర్థిక స్వేచ్ఛ కోసం విజయ సంకల్పయాత్ర

పెద్దపల్లిరూరల్: దేశానికి ఆర్థిక స్వేచ్ఛ రాలేదని న్యూ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. ప్రజలకు కనీస వసతులను కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. విద్య, వైద్యం, కూడు, గూడు లేక ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నవారెందరో ఉన్నారని తెలిపారు. అశోక్, లక్ష్మీనారాయణ, బబిత, పాల్గొన్నారు.

శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో హోమం



హోమం చేస్తున్న నంబూద్రి గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ పునప్రతిష్ఠాపనలో భాగంగా కేరళ కు చెందిన నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా హోమం, నిర్వహించారు. శ్రీఅయ్యప్ప స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి బాలమందిరంలో ప్రతిష్ఠాపన చేశారు. స్వామి వారి స్థానంలో ఈనెల 29న ఆలయంలో పంచలోహాలతో తయారు చేసిన శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహన్ని పున:ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈనెల 23 నుంచి 29 వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నంబూద్రి గురుస్వామి పేర్కొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే దాసరి



విగ్రహ ప్రతిష్ఠాపనలో విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: కాశీ మహాలింగేశ్వర స్వామి కరుణాకటాక్షలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని మడిపెల్లిలో బుధవారం కాశీ మహాలింగేశ్వర స్వామి, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాశీ నుండి తెచ్చిన మహాలింగేశ్వర స్వామి విగ్రహాన్ని హుస్సేన్ మియా వాగు ఒడ్డున ప్రతిష్ఠించడంతో జిల్లాలోనే ఈ క్షేత్రం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రా రెడ్డి, సర్పంచ్ అడిగొప్పుల రాణి జిన్న రాంచంద్రా రెడ్డి, గ్రామస్తులు, పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో బుధవారం భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ గంట లావణ్య, రమేశ్ నాయకులు ఉన్నారు.

ఓదెల:మండలంలోని మడక లో గ్రామదేవత ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మహిళలు మంగళ హారతులతో గ్రామదేవతలకు పసుపుకుంకుమలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కర్ణాటకలో భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్ మాట్లాడుతూ దేశం కోసం, హిందూ ధర్మం కోసం పాటుపడతున్న భజరంగ్‌దళ్ ఉగ్రవాద సంస్థతో పోల్చుతూ నీచ రాజకీయాలకు దిగజారుతోందన్నారు. కార్య క్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు మోడం సురేందర్‌గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి బండ సమ్మన్న, పొన్నం అంజన్న, భజరంగ్ దళ్ నగర సంయోజక్ ములుకుంట్ల శ్రీనివాస్, నగర సహాయ కార్యదర్శి మునిగల సంపత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

శివకుమార్ దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లిరూరల్: భజరంగ్‌దళ్‌పై నిషేధం విధిస్తామంటూ కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడాన్ని నిరసిస్తూ భజరంగ్‌దళ్ నాయకులు పెద్దపల్లి ప్రగతినగర్ చౌరస్తాలో బుధవారం శివకుమార్ దిష్టిబొమ్మను భజరంగ్‌దళ్ నాయకుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో దహనం చేశారు. హిందువుల వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. నాయకులు మణిదీప్, శ్రీనివాస్, నవీన్, సాయికుమార్, ఉదయ్, సాయి తదితరులున్నారు.

తడిసిన ధాన్యంపై ఆందోళన వద్దు



ధాన్యం పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్

కమాన్‌పూర్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాయలింగు అన్నారు. బుధవారం కమాన్‌పూర్, రామగిరి మండలాల పరిధిలోని కొనుగోలు కేంద్రాలను చైర్మన్ దాసరి రాయలింగు, తహసీల్దార్లు రాంమోహన్, దత్తు ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ రైతులకు భరోసా కల్పించడంపై రైతుల పక్షాన చైర్మన్ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రతి పక్షాల నాయకుల మాటలు నమ్మి ధర్నాలు రాస్తారోకోలు చేయవద్దని అన్నారు. చైర్మన్ వెంట రామగిరి తహసీల్దార్ రాంమోహన్ ఉన్నారు.

ఆర్జీ–1 ఏరియాలో ఉచిత సమ్మర్ కోచింగ్‌క్యాంప్

గోదావరిఖని: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్‌కోచింగ్ క్యాంప్ ఈనెల 6 నుంచి నెలాఖరు వరకు నిర్వహిస్తున్నట్లు జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, ప్రభావిత గ్రామాల పిల్లలు ఉచిత శిక్షణలో పాల్గొనాలని కోరారు. క్యాంప్‌లో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, బాక్సింగ్, కరాటేలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పర్సనల్ డిపార్ట్‌మెంట్ లేదా జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

నేడు వేసవి క్రీడల శిక్షణ శిబిరం

గోదావరిఖని: ఈనెల 4న వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యైటింక్లయిన్ కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలోవేసవి క్రీడల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ తెలిపారు. శిబిరంలో ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్జీ–1 ఏరియాలో పర్యటించిన చీఫ్ సెక్యూరిటీ అధికారి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1లో చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్‌రాజ్ బుధవారం పర్యటించారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌తో సమావేశమై ఏరియాలో సెక్యూరిటీకి సంబంధించిన పలు విషయాలు తెలుసుకున్నారు. బొగ్గు చోరీ, సింగరేణి ఆస్తుల చోరీకి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఏరియాలోని చెక్‌పోస్టులు, జీడీకే–5 ఓసీపీ, జీడీకే–2 ఇంక్లైన్ జంక్షన్ పాయింట్ చెక్‌పోస్ట్, సీహెచ్‌పీలు తిరిగి సెక్యూరిటీ సంబంధించిన విషయాలు పరిశీలించారు. సింగరేణి సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ చురుకుగా పనిచేయాలన్నారు. ఆయనవెంట ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులున్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ జరపండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీలో ఒక ఎజెండాలోనే రూ.కోటి వరకు అవినీతి జరిగిందంటూ అధికార పార్టీ నాయకుడు చేసిన ఆరోపణపై విచారణ జరపాలని, ప్రజాధనాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సంపత్, సుభాష్‌రావు, నాయకులు శ్రీమాన్, శ్రీనివాస్, విజయేందర్‌రెడ్డి, నెత్తెట్ల కుమార్ కోరారు. బుధవారం కలెక్టరేట్ ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డికి తెలిసే అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఇంజినీరింగ్ పనులు నిబంధనల మేరకు చేపట్టడంలో ఏఈ సతీష్ విఫలమయ్యాడని, అక్రమాలకు ఆయనే అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరపాలని, అక్రమాలకు పాల్పడుతున్న డీఈ సతీష్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.

విద్యుత్ వాడకంపై అవగాహన ఉండాలి

జ్యోతినగర్: విద్యుత్ వాడకంలో అవగాహనతో ప్రమాదాలను నివారించవచ్చని డివిజనల్ ఇంజనీర్ శివరాములు అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ఇందిరమ్మకాలనీలోని మేడిపల్లి సెక్షన్ పీకేరామయ్యకాలని సబ్‌స్టేషన్ వద్ద సిబ్బందికి, వినియోగదారులకు విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యుత్ భద్రతకు పాటించాల్సిన వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఈ రాజకుమార్, ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.